## 'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

మాట్లాడుతున్న డీఆర్‌పీవో రాథోడ్ బిక్కు

మందమర్రి రూరల్, జూలై 2 : రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆడిట్ ఆఫీసర్ రాథోడ్ బిక్కు తెలిపారు. మందమర్రి పట్టణ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో మంగళవారం అధ్యక్షుడు ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశం మేరకు రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వారి సూచనలు, సలహాల మేరకే రైతుభరోసా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. పలువురు రైతులు స్పందిస్తూ కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే అందరికీ రైతుభరోసా ఇస్తేనే వ్యవసాయం బాగుంటుందని పేర్కొన్నారు. 10 ఎకరాల్లోపు పంటలు సాగుచేసే రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని కొందరు రైతులు అభిప్రాయపడ్డారు. పంటల సాగు సమయానికి పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ముత్యం తిరుపతి, ఎంపీపీ గుర్రం మంగ, మండల కో-ఆప్షన్ సభ్యులు నజీరొద్దీన్, రాంచందర్ పాల్గొన్నారు.

## నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం

మందమర్రి, జూలై 2 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపు మేరకు బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ మంద మర్రి పట్టణంలోని మార్కెట్ వద్ద గల టీబీజీకేఎస్ కార్యాలయం ఎదుట బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేయనున్నట్లు యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర, ఏరియా నాయకులు, అన్ని గనులు, విభాగాల పిట్ కార్యదర్శులు, సోషల్ మీడియా వారియర్స్ విధిగా పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## న్యాయవాది పరిషత్ జిల్లా కమిటీ

అధ్యక్షుడు డేగ రవీందర్

కార్యదర్శి ఆంజనేయులు

మంచిర్యాల అర్బన్, జూలై 2 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాధవీ నిలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాది పరిషత్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. న్యాయవాది పరిషత్ పేదలకు, బడుగు బలహీనవర్గాల వారికి న్యాయపరమైన సలహాలు, సూచనలు చేసేందుకు ముందుంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా డేగ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా తుల అంజనేయులు, ఉపాధ్యక్షుడిగా సాగి గురువయ్య, ఎన్ లక్ష్మీరాజం, రాంబో, కార్యదర్శులుగా ఇల్ల వెంకటేశ్, వెలుముల సతీశ్, జైపాల్ రెడ్డి, లేడీ రిప్రెంజెంటేటివ్‌గా సుమలత, కోశాధికారిగా సురేందర్ చారి, జాయింట్ సెక్రటరీలుగా నరేందర్, నటేశ్వర్, శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రాణి పాల్గొన్నారు.

## తక్కలపల్లి రైల్వే గేట్ మూసివేత

రెబ్బెన, జూలై 2 : మండలంలోని తక్కలపల్లి రేల్వే గేట్ 4 నుంచి 7వ తేదీ వరకు మూసి ఉంటుందని రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే మూడోలైన్ పనులు నడుస్తుండడంతో మూసివేస్తామని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

# డయేరియా నియంత్రణకు చర్యలు

- జిల్లా వ్యాప్తంగా స్పెషల్ క్యాంపెయిన్
- అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలి
- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో అనిత

నస్పూర్, జూలై 2 : డయేరియా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీఎంహెచ్‌వో అనిత, పర్యవేక్షకులు విశ్వేశ్వర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లుతో కలిసి డయేరియా అవగాహన కార్యక్రమాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డయేరియా నియంత్రణపై ఆగస్టు 31వ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పురపాలక సంఘాలు, నీటి పారుదల శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి, ఐదేండ్లలోపు పిల్లలను గుర్తించాలని, వారి వివరాలు సేకరించాలని, నీటి విరేచనాల సమస్య ఉంటే ఓఆర్ఎస్ ద్రావణం, వయస్సు వారీగా జింక్ మాత్రలు అందించాలని సూచించారు. పారా మెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు డయేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని పిల్లలకు భోజనం చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధుల సేవలు మరువలేనివి

వాంకిడి, జూలై 2 : మండలాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అందించిన సేవలు మరువలేనివని వాంకిడి ఎంపీపీ ముండే విమలాబాయి అన్నారు. జూలై 4న ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వీవీ వరలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఐదేళ్ల కాలంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా మండలంలో అనేక అభివృద్ధి పనులతో పాటు, సర్వసభ్య సమావేశాలు సాఫీగా జరిగాయన్నారు. అనంతరం ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీలను అధికారులు శాలువాలతో సత్కరించారు. ఎంపీడీవో పీఏఎంసీ చైర్మన్ పెంటు, తహసీల్దార్ రోహిత్, ఎంపీవో ఖాజా అజీజొద్దీన్, ఎంఈవో మనుకుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రొటోకాల్ పాటించని అధికారులు

- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

కాసిపేట, జూలై 2 : కాసిపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ అధికార కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా కనీసం సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. అధికారుల తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీతో పాటు వనమహోత్సవ అధికారక ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలకు అధికారులు ఆహ్వానం ఇవ్వకపోగా,య కనీసం సమాచారం ఇవ్వలేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(యూ), జూలై 2 : సిర్పూర్(యూ) మండలంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా శక్తి చేపల పెంపకం పథకానికి ఆశక్తిగల సభ్యులు ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు చేపల పెంపకంపై రెండ్రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు, చేపల పెంపకానికి శ్రీనిధి, బ్యాంక్ ద్వారా రూ.50 వేల రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న డీఆర్డీవో కిషన్

చెన్నూర్ రూరల్, జూలై 2 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని మంచిర్యాల ఆర్డీవో కిషన్ సూచించారు. మండలంలోని కిష్టంపేట డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఎంపీడీవో ఎం మోహన్, ఎంపీవో వీరయ్య పాల్గొన్నారు.

### నీల్వాయిలో..

వేమనపల్లి, జూలై 2 : మండలంలోని నీల్వాయిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, తహసీల్దార్ రమేశ్, ఎంపీవో అనిల్‌కుమార్ మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలో 89,600 మొక్కలు నాటాల్సి ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సత్యప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాబీర్ అలీ, ఈసీ మధూకర్, మాజీ సర్పంచ్ గాలి మధు, టీపీ కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, కార్యదర్శి అశోక్, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణ, చెన్నూరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# జన్కాపూర్‌లో రైతు వేదిక ప్రారంభం

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

కన్నెపల్లి, జూలై 2 : కన్నెపల్లి మండలం జన్కాపూర్‌లోని రైతు వేదికను మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో కన్నెపల్లికి చెందిన 23 మందికి, భీమినికి చెందిన 4, వేమనపల్లికి చెందిన 10 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆ తర్వాత వన మహోత్సవంలో భాగంగా రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో గంగామోహన్, ఆర్ఐ కిషన్‌రావు, ఏపీవో శ్రీనివాస్, నాయకులు నర్సింగారావు, వైస్ ఎంపీపీ రాకేశ్ శర్మ, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, లక్ష్మీ నారాయణ, రామాంజనేయులు, సాబీర్ అలీ, మహేశ్‌గౌడ్, శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన ఎమ్మెల్యే..

బెల్లంపల్లి, జూలై 2 : బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ రైతు వేదిక ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్.. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్, మాజీ సర్పంచ్ మంద అనిత, నాయకులు హరీశ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం తొలగించాలి

బెల్లంపల్లి, జూలై 2 : బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఎస్సీ వసతి గృహం ఎదుట ఉన్న టేలాను తొలగించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్, పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేశ్ మంగళవారం మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో, వసతి గృహం ఎదుట ఉన్న ఈ టేలాలో సిగరెట్, గుట్కాలు విక్రయిస్తున్నారని, విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన

తాండూర్, జూలై 2 : విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ లోన్లపై జాగ్రత్తగా ఉండాలని తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే కుమార స్వామి సూచించారు. తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ పాఠశాలలో మంగళవారం ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ, సైబర్ క్రైమ్స్, ఆత్మ హత్యలపై అవగాహన కల్పించారు.

## దీక్షను విజయవంతం చేయాలి

చెన్నూర్, జూలై 2 : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ పేర్కొన్నారు. చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మంగళవారం దీక్షకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు శ్రావణ్, ప్రశాంత్, మల్లేశ్, శ్రీనివాస్, శ్రీధర్, పోచం, వెంకట్, దయాకర్ పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా పట్టివేత

కాగజ్‌నగర్, జూలై 2 : కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో ఇంతియాజ్‌కు చెందిన గోదాములో సోమవారం రాత్రి నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించి, పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాటి విలువ రూ.6,88,400 ఉంటుందని స్పష్టం చేశారు. ఇంతియాజ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ మహేందర్, సిబ్బంది ఉన్నారు.

## మూడోసారీ వేలం వాయిదా

జైనూర్, జూలై 2 : మండల కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే వార సంత వేలం మూడోసారీ వాయిదా పడింది. జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం వేలం నిర్వహించగా, ప్రభుత్వ నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఈఓ ఉదయ్ రామ్ ప్రసాద్ తెలిపారు. వివరాలను డీపీవోతోపాటు, డీఎల్పీవోకు నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు. మళ్లీ అధికారుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మండల పంచాయతీ అధికారి శివకుమార్, పంచాయతీ ఉద్యోగులు, వేలం దారులు పాల్గొన్నారు.

## ఎల్కపల్లి వారసంత వేలం

పెంచికల్ పేట్, జూలై 2 : మండల కేంద్రంలోని ఎల్కపల్లి పంచాయతీలో మంగళవారం ఎంపీవో గంగాసింగ్ ఆధ్వర్యంలో కార్యదర్శి చంద్రశేఖర్ వారసంత వేలం నిర్వహించారు. జాడి మల్లేశ్ రూ.1,12,700 వేలం దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెంచికల్ పేట్, జూలై 2 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఆల్బర్ట్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గంగా సింగ్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీ

జైనూర్, జూలై 2 : జైనూర్ మండల కేంద్రంలోని షేక్ నదీమ్ షాపులో మంగళవారం ఎస్ఐ సందీప్ కుమార్ తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి గుట్కా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

లక్షెట్టిపేట, జూలై 2 : లక్షెట్టిపేట మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సరోజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, అన్ని గ్రామాల ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరవ్వాలని పేర్కొన్నారు.

## దరఖాస్తు చేసుకోండి

కాసిపేట, జూలై 2 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో కళాశాలలోనే నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే 6, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బాలికలకు హాస్టల్ వసతి సౌకర్యం ఉందని తెలిపారు. వివరాలకు 95509 32264 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## భగీరథ పైప్ లైన్‌కు మరమ్మతులు

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వాంకిడి, జూలై 2 : 'మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ' అని మంగళవారం 'నమస్తే'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని చిక్లి వాగు గ్యాస్ గోదాం పక్కన మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీకి జేసీబీ సాయంతో మరమ్మతులు చేపట్టారు. నీటి సరఫరాను పునరుద్ధరించారు.

## కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్, జూలై 2 : విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేవారు. ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శైలజకు మంగళవారం వినతి పత్రం అందించారు. జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా తమ కాలేజీల్లోనే డిగ్రీ చేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. విద్యార్థులు బీటెక్, బీ ఫార్మసీ లాంటి కోర్సులు చేయాలనుకుంటే.. ప్రైవేటు కాలేజీలు మాత్రం తమ వద్దనే డిగ్రీ చేయాలని, లేకపోతే అధిక మొత్తంలో ఫీజులు చెల్లించాలని, ఆ తర్వాతనే సర్టిఫికెట్లు ఇస్తామని బెదిరిస్తున్నాయని ఆరోపించారు. వెంటనే ఈ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

దండేపల్లి, జూలై 2 : దండేపల్లి మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరవావలని సూచించారు. మండలంలోని వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే ఎంపీటీసీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో సన్మానం ఉంటుందని పేర్కొన్నారు.

## డీపవీ స్కూల్ సీట్ల కేటాయింపులో వివక్ష

కాసిపేట, జూలై 2 : కాసిపేట మండలం దేవాపూర్‌లో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఢిల్లీకి సంబంధించిన డీపవీ స్కూల్‌లో స్థానిక ముస్లిం పిల్లలకు కావాలనే అడ్మిషన్ సీట్లు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఎంఐఎం మండలాధ్యక్షుడు ఎండీ అలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ స్కూల్‌లో ముస్లిం పిల్లలకు అసలే ఇవ్వకుండా దాటవేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాకుండా ఢిల్లీ నుంచి ఆదేశాలని, ఇక్కడి విధానాలు అవసరం లేకుండా పాఠశాల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కరించాలని, లేకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని స్పష్టం చేశారు. ఎంఐఎం టౌన్ అధ్యక్షుడు ఎస్‌కే జహీర్, సలహాదారులు ఖైరత్ హుస్సేన్, షేక్ సాబీర్, షేక్ రఫీక్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు చర్యలు

### మంచిర్యాల డీసీపీ భాస్కర్

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి, జూలై 2 : నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పోలీస్ అధికారులకు సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయం, రూరల్ సీఐ కార్యాలయం, వన్‌టౌన్, టూ టౌన్, తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రూరల్ సీఐ కార్యాలయం ఆవరణలో పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అన్ని పోలీస్‌స్టేషన్ల వద్ద పరిసరాలను పరిశీలించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో పాటు, సంబంధిత ఎస్ఐలు డీసీపీకి పూలమొక్క బహూకరించి, స్వాగతం పలికారు. పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, పోలీస్‌స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్లజొద్దీన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, తాళ్లగురిజాల ఎస్ఐ నరేశ్‌కుమార్, టూ టౌన్ ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.

## ఒకరికి పదేండ్ల జైలు

జైనూర్ జూలై 2 : గంజాయి అక్రమ రవాణా కేసులో ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దినకర్ సునీల్‌కు పదేండ్ల జైలు శిక్షతో పాటు, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారని జైనూర్ సీఐ అంజన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2021, ఆగస్టు 27న దినకర్ సునీల్ తన ఆటోలో 25.300 కిలోల గంజాయి రవాణా చేస్తుండగా, జైనూర్ పోలీసులు పట్టుకున్నారు. విచారించగా, నేరం ఒప్పుకున్నాడు. ఈ మేరకు సునీల్‌పై సుమోటోగా కేసు నమోదు చేశారు. అప్పటి ఐవోలు తిరుపతి, హనూక్ అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించగా, నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పును వెల్లడించారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, జైనూర్ సీఐ అంజన్న, ఎస్ఐ కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

## తలసేమియాపై అవగాహన

జైనూర్, జూలై 2 : జాతీయ తలసేమియా(రక్తహీనత) కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సూచన మేరకు ఆదివాసీ మిత్ర సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉషేగాం ప్రభుత్వ దవాఖానలో, రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జైనూర్ వైద్యాధికారి జితేందర్ రెడ్డి, ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ కో-ఆర్డినేటర్, తలసేమియా జిల్లా కో-ఆర్డినేటర్ ఆడ వెంకటేశ్ మాట్లాడారు. తలసేమియాపై గ్రామాల్లో అవగాహన పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో రాసిమెట్ట ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, హెచ్‌ఈవో రమేశ్ జాదవ్, సూపర్‌వైజర్ విజయ్, రాసిమెట్ట వార్డెన్ మెస్రం మోతీరాం, హెల్త్ అసిస్టెంట్లు పేందూర్ భరత్, విజయ్, ప్రవీణ్, జలపత్, వైద్య ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

దిష్టి బొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, జూలై 2 : జిల్లా కేంద్రంలోని అర్చనా టెక్స్ చౌరస్తాలో మంగళవారం మంచిర్యాల హిందూ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం పార్లమెంట్ సమావేశాల్లో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా అనుచిత వాఖ్యలు చేసినందుకు దిష్టి బొమ్మను దహనం చేసినట్లు పేర్కొన్నారు. నాయకులు కర్ణకంటి రవీందర్, రామగిరి శ్రీనివాస్, శ్రీకాంత్, సంజీవ్, హరికృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నస్పూర్, జూలై 2 : రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి జూన్ 28న నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్ల